## నమ్రత

> “కరుణామయుని దాసులు ఎవరంటే, నేలపై అణకువతో నడిచేవారూ, మూర్ఖులు వారిని పలుకరించినపుడు మీకో సలామ్ అని అనేవారూ.”
> (ఖుర్ఆన్ 25 : 63)

ప్రవక్త ముహమ్మద్ (ఆయనకు శాంతి కలుగుగాక) తనను చూసి ఎవరైనా గౌరవంగా లేచి నిలబడితే వద్దనేవారు. సమావేశాల్లో ఎక్కడ చోటు దొరికితే అక్కడే కూర్చునేవారు. ప్రత్యేక స్థానం కావాలని కోరుకునేవారు కాదు. తన అనుచరులకన్నా ప్రత్యేకంగా కనబడేలా దుస్తులు ఎన్నడూ ధరించలేదు. వారి కన్నా ఉన్నత హోదాలో కనబడే వస్త్రాలు కోరుకోలేదు. పేదలతో కలగలిసిపోయేవారు. వృద్ధులతో కలిసి కూర్చునేవారు, వితంతువులకు సహాయపడేవారు. ఆయన గురించి తెలియని వారు పదిమందిలో ఆయన్ను ప్రత్యేకంగా గుర్తించడం సాధ్యపడేది కాదు.

తన అనుచరులను ఉద్దేశించి మాట్లాడుతూ “వినమ్రంగా ఉండాలని దేవుడు నన్ను ఆదేశించాడు. ఒకరి కన్నా ఒకరు ఎక్కువని చెప్పుకోరాదు. ఒకరిని ఒకరు అణిచివేయరాదు.” అన్నారు.

ఆయన వినమ్రత ఏ స్థాయిలో ఉండేదంటే, తనను ఆరాధించడం ప్రారంభిస్తారేమోనన్న భయం ఉండేది. ఆరాధనకు అర్హుడు కేవలం దేవుడు ఒక్కడే.

“నన్ను ప్రశంసించడంలో పరిధి దాటవద్దు. మేరీమాత కుమారుడు ఏసుక్రీస్తు విషయంలో క్రైస్తవుల మాదిరిగా చేయవద్దు. నేను విశ్వ ప్రభువుకు దాసుడిని మాత్రమే. నన్ను అల్లాహ్ దాసుడిగా, ఒక ప్రవక్తగా మాత్రమే పిలవండి అన్నారు.”

## ఆదర్శ భర్త

> “మీ స్త్రీలతో సద్భావంతో జీవితం గడపండి.”
> (ఖుర్ఆన్ 4 :19)

ప్రవక్త ప్రియ సతీమణి హజ్రత్ ఆయేషా(ర) ఒకసారి తన భర్త గురించి “ఆయన ఎప్పుడు ఇంటిపనిలో సహాయం చేసేవారు. తన దుస్తులు, చెప్పులు తానే మరమ్మత్తు చేసుకునేవారు. నేలఊడ్చేవారు. పశువుల పాలు తీసేవారు, వాటిని కాపాడేవారు, వాటికి మేత వేసేవారు. ఇంటిపనులు చేసేవారు.”

ఆయన కేవలం ఒక మంచి భర్త మాత్రమే కాదు, తన అనుచరులు కూడా అలాగే ఉండాలని చెప్పేవారు. “విశ్వాసుల్లో అందరి కన్నా ఉన్నతులు నైతికంగా ఉన్నతస్థాయి కలిగిన వారు. తమ భార్యలపట్ల ఉత్తమంగా మెలిగేవారు వారిలో ఉన్నతులు” అన్నారు.

## ఉత్తమ నమూనా

> “నీవు నిస్సందేహంగా మహోన్నతమైన శీలం కలవాడవు.”
> (ఖుర్ఆన్ 68 : 4)

ప్రవక్త ముహమ్మద్ (స) ఎలా జీవించారన్నది చెప్పే క్లుప్తమైన ఉదాహరణలు మాత్రమే ఇవి. నేడు ఇస్లామ్ గురించి, ప్రవక్త గురించి అపోహలు వ్యాపింపజేస్తున్న వాతావరణంలో ఇక్కడ ప్రస్తావించిన ఆయన క్షమాగుణం, దయాస్వభావం చాలా మందికి ఆశ్చర్యం కలిగించవచ్చు.

ఇస్లామ్‌ను అర్థం చేసుకోవాలనుకుంటే ఇస్లామీయ ధార్మిక గ్రంథాలు దివ్యఖుర్ఆన్, ప్రవక్త ముహమ్మద్ (స) ప్రవచనాలు, ఆచరణల హదీసు గ్రంథాలను స్వయంగా చదవాలి. కొందరు ముస్లిముల దారితప్పిన వ్యవహారశైలి చూసి ఒక నిర్ణయానికి రాకూడదు.

## ముస్లిమేతరుల వ్యాఖ్యలు

భారత స్వతంత్ర సంగ్రామ సారథి గాంధీజీ ఆయన గురించి ఇలా చెప్పారు


“నేను లక్షలాది మానవుల హృదయాలను నిర్ద్వంద్వంగా వశపరుచుకున్న ఆ ఉత్తమ వ్యక్తిని గురించి తెలుసుకోదలిచాను. ఆ కాలపు జీవన పంథాలో ఇస్లాంనకు ఓ స్థానాన్ని సాధించగలిగింది కత్తి కాదని నాకు గట్టి నమ్మకం కుదిరింది. కేవలం ప్రవక్త చూపిన నిరాడంబరత, త్యాగనిరతి, వాగ్దానపాలన పట్ల శ్రద్ధ, మిత్రుల సహచరులపట్ల అమితమయిన అంకిత భావం, స్థిరచిత్తం, ఆయనలోని నిర్భీతి, దైవం పట్ల, తన ధ్యేయం పట్ల అచంచల విశ్వాసం - కేవలం ఇవే కాని కత్తి కాదు సకలఅవరోధాలను అధిగమించ గలిగింది.”

ప్రఖ్యాత బ్రిటీషు రచయిత జార్జి బెర్నార్డ్ షా ఏమన్నారంటే

“ముహమ్మద్ వంటి మనిషి నేడు ప్రపంచానికి చాలా అవసరం. మధ్యయుగాల్లో మతావలంబీకులు వారి అజ్ఞానం, పక్షపాతాల కారణంగా ఆయన్ను తప్పుగా చిత్రీకరించారు. ఆయన క్రైస్తవానికి శత్రువని భావించడం వల్ల అలా చేశారు. కాని ఆయన జీవితకథ తెలుసుకున్న తర్వాత నాకు అద్భుతమనిపించింది. ఆయన ఎన్నడూ క్రైస్తవానికి శత్రువు కాదు.మానవాళి సంరక్షకుడిగా ఆయన్ను అభివర్ణించాలి. నా అభిప్రాయంలో ఆయనలాంటి వ్యక్తి ఆధునిక ప్రపంచాన్ని నిరంకుశంగా పరిపాలిస్తే అతను దీని సమస్యల్ని పరిష్కరించడంలో విజయం సాధించి తద్వారా ప్రపంచానికి నేడు అన్నింటి కన్నా అధికంగా కావలసిన శాంతి సంతోషాలను పంచి పెట్టగలడని నా దృఢ విశ్వాసం.”

సంప్రదించండి
IIC
ఇస్లామిక్ ఇన్ఫర్మేషన్ సెంటర్
040 - 6832 7832 - Hyderabad

# ప్రవక్త
# ముహమ్మద్
## (ఆయనకు శాంతి కలుగుగాక)



మౌలిక విషయాలు
తెలుసుకుందాం

040 - 6832 7832
Toll Free 1800 572 3000
www.discovertruepath.com
You Tube : DiscoverTruePath

# ముహమ్మద్ ఎవరు?

(అయనకు శాంతి కలుగుగాక)

> "వాస్తవంగానే అల్లాహ్ ప్రవక్తలో మీకు ఒక మంచి ఆదర్శం ఉండినది; అల్లాహ్‌పై, అంతిమ దినంపై ఆశలు పెట్టుకుని అత్యధికంగా అల్లాహ్‌ను స్మరించే ప్రతివ్యక్తికి."
> (ఖుర్ఆన్ 33 : 21)

ఏకైక దేవుడు (అరబ్బీ భాషలో అల్లాహ్)ను మాత్రమే విశ్వసించేలా మానవాళికి పిలుపునివ్వడానికి దేవుడు పంపించిన ప్రవక్తల పరంపరలో చిట్టచివరి ప్రవక్త ముహమ్మద్ (అయనకు శాంతి కలుగుగాక). దేవుడు పంపిన ప్రవక్తలలో కొందరి పేర్లు : ఆదమ్, నూహ్, ఇబ్రాహీం, ఇస్మాయీల్, ఇస్‌హాఖ్, యాకూబ్, యూసుఫ్, మూసా, దావూద్, సులైమాన్,ఈసా, ( ఏసుక్రీస్తు - వారందరికి శాంతి కలుగుగాక).

మూసా (అ) ప్రవక్తకు తౌరాత్ గ్రంథాన్ని ఏసుక్రీస్తు (అ)కు గోస్పెల్ (ప్రస్తుతమున్న సంపుటాలు కాదు, మార్పులు చేర్పులకు గురికాని మూలగ్రంథం) ప్రసాదించి పంపిన మాదిరిగానే ప్రవక్త ముహమ్మద్ (స)కు ఖుర్ఆన్ గ్రంధాన్ని ప్రసాదించి దేవుడు పంపించాడని ముస్లిములు విశ్వసిస్తారు. ఖుర్ఆన్ బోధనలను ఎలా ఆచరించాలో చూపించడానికి ఆయన పంపబడ్డారు.

ప్రవక్త (స) భార్య హజ్రత్ ఆయేషా(ర.జి)ను ఒకసారి మీ భర్త ఎలాంటివారని ప్రశ్నించినప్పుడు ఆమె జవాబిస్తూ "ఆయన నడిచే ఖుర్ఆన్" అని అన్నారు. అంటే ఆయన దివ్యఖుర్ఆన్ బోధనలను అత్యంత సూక్ష్మంగా తన జీవితంలో ఆచరించి చూపించారు. దివ్యఖుర్ఆన్ ప్రసాదించిన అత్యుత్తమ బోధనలను ఆయన ఎలా ఆచరించి చూపించారో చూద్దాం.

## కారుణ్య ఉద్యమం

> ఓ ప్రవక్తా! మేము నిన్ను ప్రపంచ మానవులకు కారుణ్యంగా పంపాము.
> (ఖుర్ఆన్ 21: 107)

దైవప్రార్థనలు, ఉపవాసాలు, దానధర్మాలు చేసేలా ప్రజలను ప్రోత్సహించడంతో పాటు, మనిషి ఇతరులతో ఎలా వ్యవహరించాలన్నది కూడా విశ్వాససూత్రాలప్రకారం ఉండాలని బోధించారు. "మీలో ఉత్తమ వ్యక్తిత్వం కలిగిన వారే ఉత్తములని" చెప్పారు.

ప్రవక్త ముహమ్మద్ (ఆయనకు శాంతికలుగుగాక) బోధనలు అనేకం విశ్వాసానికి, ఆచరణలకు మధ్య ఉన్న సంబంధాన్ని నొక్కి చెప్పాయి. ఉదాహరణకు "అల్లాహ్‌ను, తీర్పుదినాన్ని విశ్వసించే వ్యక్తి తన పొరుగువారికి నష్టం కలిగించరాదు. అల్లాహ్‌ను, తీర్పుదినాన్ని విశ్వసించే వ్యక్తి మాట్లాడితే మంచిమాట మాట్లాడాలి లేదా మౌనంగా ఉండాలి."

మనుష్యులు దయాస్వభావం కలిగి ఉండాలని, ఇతరులపట్ల గౌరవం చూపాలని అంతిమ ప్రవక్త బోధించారు. "ఇతరులపై దయచూపని వ్యక్తిపై దయచూపడం జరగదు" అన్నారు.

అవిశ్వాసులను శిక్షించేలా దేవుని ప్రార్థించండని కొందరు ప్రవక్తను కోరినప్పుడు "నేను శపించడానికి రాలేదు, కారుణ్యంగా వచ్చాను" అని జవాబిచ్చారు.

## క్షమాగుణం

> "వారిని క్షమించాలి, వారిని ఉపేక్షించాలి. మిమ్మల్ని అల్లాహ్ క్షమించాలని మీరు కోరుకోరా? అల్లాహ్ గుణం ఏమిటంటే ఆయన క్షమించేవాడు, కరుణించేవాడూను."
> ( ఖుర్ఆన్ 24 : 22)

ప్రవక్త ముహమ్మద్ (స) అత్యంత క్షమాగుణం కలిగిన వారు. దయాస్వభావులు. ఆయన్ను ఎవరైనా నిందించినా క్షమించేవారు. ఎదుటి వ్యక్తి ఎంత పరుషంగా, కఠినంగా వ్యవహరిస్తాడో ఆయన అంతే శాంతంగా, సహనంగా ఉండేవారు. ఆయన ఆధిక్యత కలిగి ఉండి, ప్రాబల్యం వహించినప్పుడు, ప్రతీకారం తీసుకునే శక్తిసామర్థ్యాలు ఉన్నప్పుడు మరింత ఎక్కువగా ఉదారస్వభావం, క్షమాగుణం చూపేవారు.

ప్రవక్త ముహమ్మద్ (స) ఎలాంటి కరుణాస్వభావం కలిగి ఉండేవారంటే, ఆయనపై ఎంత దౌర్జన్యం జరిగినా క్షమించేవారు. దయస్వభావానికి, క్షమాగుణానికి ఆయన ఉత్తమ ఉదాహరణగా దివ్యఖుర్ఆన్ పేర్కొన్నది.

**"ప్రవక్తా! మృదుత్వం, మన్నింపుల వైఖరిని అవలంబించు, మంచిని ప్రబోధించు. మూర్ఖులతో వాదానికి దిగకు." (ఖుర్ఆన్ 7:199)**

## సమానత్వం

> "వాస్తవానికి మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే అల్లాహ్ దృష్టిలో ఎక్కువ గౌరవపాత్రుడు."
> (ఖుర్ఆన్ 49 : 13)

దేవుని దృష్టిలో మానవులందరూ సమానులేనని ఆయన బోధించారు. "మనుష్యులందరు ఆదమ్ నుంచి వచ్చారు. ఆదమ్ మట్టితో సృష్టించబడ్డారు. ఒక అరబ్బుకు అరబ్బేతరునిపై ఎలాంటి ఆధిక్యతా లేదు. తెల్లవానికి నల్లవానిపై ఎలాంటి ఆధిక్యతా లేదు. కేవలం ధర్మపరాయణత విషయంలో తప్ప."

"మీ బాహ్యరూపం, మీ సంపదను చూసి దేవుడు న్యాయం చేయడు. మీ ఆలోచనలు, ఆచరణలను చూసి న్యాయం చేస్తాడు."

ఒకసారి ప్రవక్త ముహమ్మద్ (ఆయనకు శాంతికలుగుగాక) అనుచరుల్లో ఒకరు మరొక అనుచరుడిని నల్లమహిళ కొడుకని పిలిచారు. ఆ వెంటనే ప్రవక్త ఆగ్రహంగా "ఆయన తల్లి నల్లమహిళ కాబట్టి కించపరుస్తున్నావా, నీలో ఇంకా ఇస్లామ్ పూర్వపు అజ్ఞానం మిగిలి ఉంది." అన్నారు.

## సహనం

> "ప్రవక్తా! మంచీ చెడూ ఒకటి కావు. నీవు చెడును శ్రేష్ఠమైన మంచి ద్వారా తొలగించు. అప్పుడు నీపట్ల శత్రుభావం కలవాడు నీ ప్రాణస్నేహితుడై పోవటాన్ని నీవు గమనిస్తావు."
> (ఖుర్ఆన్ 41 : 34)

మీకుచెడు చేసినవారి పట్ల చెడుగా వ్యవహరించరాదు. వారి పట్ల క్షమాగుణం, దయాస్వభావంతో వ్యవహరించండి - అన్నారు. ప్రవక్త ముహమ్మద్ (స) తనపై దాడి చేసినవారి పట్ల, తనపట్ల దౌర్జన్యానికి పాల్పడిన వారిపట్ల వ్యవహరించిన తీరిది.

ప్రతీకారం తీర్చుకునే అవకాశాలున్నా ప్రవక్త ముహమ్మద్ (స) క్షమించి విడిచిపెట్టిన అనేక సంఘటనల వివరాలు మనకు ఆయన జీవిత చరిత్రలో కనిపిస్తాయి.

మనిషి కష్టకాలంలో సహనం వహించాలని ఆయన బోధించారు.

**"తన బలంతో ఇతరులను ఓడించేవాడు బలవంతుడు కాదు. ఆగ్రహంలో కూడా తన్ను తాను అదుపు చేసుకునేవాడే బలవంతుడు"** అన్నారు.

క్షమాగుణం, దయాస్వభావం కలిగి ఉండడమంటే తనపై దాడి జరిగినా ఆత్మరక్షణ చేసుకోకుండా నిష్క్రియాపరత్వంతో వ్యవహరించడం కాదు. ప్రవక్త ముహమ్మద్ (ఆయనకు శాంతి కలుగుగాక) ఈ విషయాన్ని స్పష్టంగా వివరిస్తూ

"శత్రువుకు ఎదురుపడాలని కోరుకోవద్దు. కాని ఎదురుపడితే సహనచిత్తంతో వ్యవహరించండి (శత్రువును ఎదుర్కొంటున్నప్పుడు స్థిరంగా ఉండండి)" అన్నారు.

## మృదువైఖరి

> "అల్లాహ్ యొక్క అనంత కరుణవల్లనే నీవు వారిపట్ల మృదుస్వభావుడవు అయ్యావు. నీవే గనక కర్కశుడవు, కఠిన హృదయుడవు అయినట్లయితే వారందరూ నీ చుట్టుప్రక్కలనుండి దూరంగా పోయేవారు."
> (ఖుర్ఆన్3 : 159)

ప్రవక్త ముహమ్మద్ (స) కు పదేళ్ళ పాటు సేవలు చేసిన ఒక అనుచరుడు మాట్లాడుతూ ప్రవక్త తనపట్ల ఎల్లప్పుడు చాలా మృదువైఖరితో ఉండేవారని అన్నారు. "నేను ఏదన్నా పనిచేసినప్పుడు, నా పనిచేసే పద్ధతిని ఆయన ఎన్నడూ ప్రశ్నించలేదు. నేను ఏదన్నా పని చేయనప్పుడు ఎందుకు చేయలేదని ప్రశ్నించలేదు. ఆయన వంటి స్నేహశీలం కలిగినవారు ఎవ్వరూ లేరు." అన్నారు.

ఒక సందర్భంలో ప్రవక్త ముహమ్మద్ (స) భార్య ఒకరు, ఒక వ్యక్తి అవమానకరంగా మాట్లాడినప్పుడు ఆగ్రహంతో ప్రతిస్పందించారు. అప్పుడు ప్రవక్త ఆమెతో "ఆయేషా, శాంతంగా, మృదువైఖరి పాటించు. అన్ని వ్యవహారాల్లోను అల్లాహ్ మృదువైఖరిని ఇష్టపడతాడు." అన్నారు.

అంతేకాదు, "మృదువైఖరి పాటించండి, ఎందులోనైనా మృదువుగా ఉంటే అందంగా ఉంటుంది. మృదుత్వాన్ని కోల్పోతే అది లోపం అవుతుంది." అన్నారు.